# కొవ్వొత్తి

ఆ చల్లని సాయంత్రం మెత్తని పచ్చిక మీద కూర్చున్నారు వారిద్దరూ. అతని మనసులోని ఆనందం ముఖం మీద స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె మెదడులోని ఆలోచనలు ఆమె కళ్లల్లో కదులుతున్నాయి.

''లతా ! నిజం చెప్తున్నా. నిన్ను నేను ప్రేమిస్తున్నాను'' అన్నాడు మధు.

లత వెంటనే సమాధాన మేమీ ఇవ్వలేదు. మౌనంగా గడ్డి పరకలు తెంచుతూ కూర్చుంది.

''నీకు నేనంటే ఇష్టం లేదా?'' అన్నాడు మధు.

''నేనలా నీ కెప్పుడూ చెప్పలేదు'' సంజాయిషీ ఇస్తూ లత చెప్పిన జవాబు మధుకి చిరాకు కలిగించింది.

''నా ప్రేమను నువ్వు శంకిస్తున్నావు''

''అవును. నిజమే, నువ్వెలా అనుకున్నా సరే. మన పెళ్లి జరుగుతుందా అని శంకిస్తున్నాను''

''నీ కెందుకా సందేహం?'' ఆత్రుతగా అడిగాడు మధు.

''మీ ఇంట్లో మీ అమ్మగారికి, నాన్నగారికీ చెప్పావా ?''

''వాళ్లకి చెప్పినా, చెప్పకపోయినా, వాళ్లు ఒప్పుకున్నా, ఒప్పుకోక పోయినా మన పెళ్లి జరిగి తీరుతుంది'' అన్నాడు దృఢంగా మధు.

''అదే నాకు చిరాకు. నే నడిగింది ఇంట్లో చెప్పావా అని!'' అంది విసుగ్గా.

''చెప్పలేదు'' అన్నాడు మధు.

''ఏం, ఎందుకు?''

''చెప్తే వాళ్లెలాగూ ఒప్పుకోరు. అక్కడ్నించి గొడవలు మొదలవుతాయి''

''గొడవలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధపడే కదా ఈ వ్యవహారంలోకి దిగావు!''

''అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి.'' మధు విసుగ్గా అడిగాడు.

''చెప్తున్నాను విను. ముందు ఇంట్లో చెప్పు. వాళ్లెలా మాట్లాడినా, వాళ్లను ఒప్పించడానికి ప్రయత్నించు!''

''ఓహో ! అలాగా ! అంటే నీకు ఇష్టం లేదని చెప్పడానికి ఇదొక సాకు. అంతేనా!''

''నీ బుర్ర ఇంతవరకే పనిచేస్తే నేను బాధ్యురాలిని కాను గానీ, నీ కిష్టం లేదంటే ఆ మాట సూటిగా చెప్పే ధైర్యం నాకుంది!'' అంది లత.

మధు బ్లేడుతో చేతి మీద చెక్‌మని కోసుకుని రక్తంతో ''లతా ! ఐ లవ్ యూ!'' అని రాసి, ఆ కాగితం ముక్క లత చేతిలో పెట్టాడు.

ఆమె ఒక్క క్షణం చలించిపోయింది.

''ఏమిటి మధూ ఇది!'' అంది.

''నా ప్రేమ ఎంత బలమైనదో నీకు చెప్పాలని'' అన్నాడు.

లత వెంటనే సర్దుకుంది. ''నా కిలాంటివి నచ్చవు. నువ్వు మీ ఇంట్లో మీ అమ్మకి, నాన్నగారికి చెప్పి, ఆ తర్వాత నాకు చెప్పు. అప్పుడు నా అభిప్రాయం చెప్తాను'' అంది నిశ్చయంగా.

''అయితే విను. మా అమ్మ కాదన్నా నేను లక్ష్యపెట్టదలచుకోలేదు. వాళ్లందరినీ వదులుకోవడానికి నేనెప్పుడో సిద్ధపడ్డాను. నాకు వాళ్లందరూ లేకపోయినా ఫరవాలేదు'' అన్నాడు.

''ఎందువల్ల ?''

''నాకు నీ మీదున్న ప్రేమవల్ల''

''మీ యింట్లో అమ్మ మీద, నాన్న మీదా నీ అన్నదమ్ముల మీదా ప్రేమ లేదా!'' అంది సూటిగా మధువైపు చూస్తూ.

''ఉంది కానీ వాళ్ళ ప్రేమను నీ కోసం వదులుకోగలను''

''వాళ్ళు వదులుకోలేకపోతే?''

''అది నాకనవసరం'

''అదేమిటి'' ఆశ్చర్యంగా అంది. కానీ ఆమె ముఖంలో వ్యంగ్యం తొంగి చూస్తోంది.

''అది వాళ్ళాలోచించుకోవాల్సిన విషయం''

''అదే మధూ ! అదే కొంచెం... నాకూ ఆలోచించుకోవాలనిపిస్తోంది'' అంది లత ఆలోచనగా.

''అంటే నీవుద్దేశం?''

''ఏమీ లేదు. ఇరవై ఏళ్ళు. నిన్ను అష్టకష్టాలు పడి పెంచి, పెద్దచేసి చదివించి నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల్ని అకారణంగా వదులుకోవడానికి సిద్ధ పడుతున్న నిన్ను గురించి ఆలోచించుకోవాలిగా మరి

''లతా ! నా ప్రేమను శంకించకు'' మధు తీవ్రంగా అన్నాడు.

''అనుమానమేమీ లేదు గానీ నీ పిరికితనం గురించి ఆలోచిస్తున్నా''

''పిరికితనమా ! పిరికివాడినైతే రక్తంతో నా ప్రేమ నీకు తెలియజేయగలనా?''

''అదే అర్థం కావడం లేదు. అంత ధైర్యవంతుడివి ఇంట్లో మన ప్రేమ విషయం చెప్పి పెళ్లికి ఒప్పించలేవా అని ఆలోచిస్తున్నాను''

''ఇంతకీ ఏమిటి నీ బాధ''-

''బాధ కాదు. నా కన్నిటికంటే పిరికితనమంటే అసహ్యం''

''మా అమ్మ చచ్చిపోతానంటుంది. మా నాన్న తలబాదుకుంటాడు. చెప్తే యిదే జరిగేది'' -

''ఒకవేళ మీ అమ్మ నిజంగా చచ్చిపోతే....?''

''మా అమ్మ చచ్చిపోయినా నువ్వు నాకు కావాలి''

''కానీ నువ్వు నాకక్కర లేదు'' అంది కఠినంగా

''ఏం ? ఎందుకని ?''

''ఈరోజు మీ అమ్మని అంత నిర్దయగా తిరస్కరించిన వాడివి. మరో సందర్భం లో నన్ను తిరస్కరించవనేముంది ?''

''అలా నేను చస్తే చేయను''

''నాకు నమ్మక మేమిటి . నువ్వు బంధాలు, అనుబంధాలు అరక్షణంలో తెంచుకో గలవనిపిస్తోంది''

''నీతో మాత్రం అలా తెంచుకోలేను'' ఆవేశంగా అన్నాడు.

''మధూ ! నువ్వు మీ అమ్మగారికి నాన్నగారికి చెప్పిరా వారేమన్నారో చెప్పు''

''వాళ్ళు కాదంటే''

అప్పుడే దాని సంగతి ఆలోచిద్దాం''

ప్రేమికులకుండాల్సిన ఆవేశం, వేడి, వాడీ నీలో అస్సలు లేవు నాకెంతో నిరుత్సాహంగా ఉంది'' చప్పగా అన్నాడు మదు.

సరేలే ! ఇప్పటికే చాలా ఆలస్యమైంది. మరి పోతాను'' లత లేచింది.

లతా ! నువ్వు లేనిపోని అనుమానాలు పెట్టుకోకు. నువ్వు లేకపోతే నేను ప్రాణాలతో ఉండను సుమా'' అన్నాడతను బేలగా.

''నిజమే, నువ్వు లేకపోతే మీ నాన్న అమ్మా ప్రాణాలతో ఉండమంటే ?

''వాళ్ళని పోతేపోనీ''

''కాదు మధూ, కానే కాదు వాళ్ళు నీకు అక్కరలేకున్నా నాకు కావాలి. నాకు నీతోబాటుగా నీ కుటుంబ సభ్యులతో స్నేహం కావాలి. వారి యోగక్షేమాలు కావాలి''

లత మాటలు విని తలకొట్టుకుని, విసుగ్గా బాధపడి పోయాడు మధు.

లత అతని దగ్గర సెలవు తీసుకుని గంభీరంగా నడచి వెళ్ళిపోతుంటే ఆమె వైపు అయోమయంగా చూస్తూండిపోయాడు మధు.

★ ★ ★ ★

సావిత్రికి మనసు మనసులో లేదు. గుండె దడదడ లాడుతోంది. బూరెల మూకుట్లో కూర మాడిపోతుంటే చూసుకోనే లేదు. కూరలో ఉప్పు అనుకున్న దానికంటే ఎక్కువ పడిపోయింది.

అరగంట క్రితం తమ పుత్ర రత్నం తన ప్రేమ కథ చెప్పగానే ఆ ఇల్లాలి కాళ్లూ చేతులూ ఆడటం మానేశాయి. ఆమెకేం చేయాలో తోచలేదు. తనొక పిల్లని చూడాలని, చూడటానికి పెళ్లి చూపులకి వెళ్లాలనీ, కట్న కానుకలు మాట్లాడాలనీ, తనకి నచ్చిన తర్వాతనే తన కొడుకు మధుని పంపాలని, అనుకుంది. కానీ... ఇదేమిటిది ? అంతా తిరగబడిపోయింది. వాడే చూసేసుకున్నాడు. నచ్చేసింది పిల్ల, తననూ, తన భర్తని అంగీకార సంతకం చెయ్యమంటున్నాడు మధు. ఇప్పుడేం చేయ్యాలి ? హిరణ్యకశిపుడి లాంటి భర్త నుండి తన బిడ్డను ఎలా కాపాడుకోవాలి ?

''సావిత్రీ!'' భర్త పిలుపు విని ఉలిక్కిపడింది. అవును. మధు ఈ మాట

చెప్పినప్పటి నుంచీ శాస్త్రి ఒక్కడూ గదిలో మంచం మీద వెల్లకిలా పడుకుని ఉన్నాడు. అది ఆలోచనో, ఆవేదనో తెలుసుకోవడం కష్టం.

''పిలిచారా !'' అంటూ లోపలి కెళ్లింది సావిత్రి.

''అవును. ఇలా రా ! ఇక్కడ కూర్చో !''అన్నాడు శాస్త్రి. అతని గొంతులో కోపం, ఉద్రేకం లేకపోవడం చూసి ఆశ్చర్యపోయింది సావిత్రి.

''మనవాడింత పని చేస్తాడ నెప్పుడూ అనుకోలేదు'' అంది దుఃఖంగా.

''ఇప్పుడేమైందని అంత బాధపడుతున్నావా?'' అన్నాడు శాస్త్రి.

''ఇంకా ఏం కావాలి ?'' ఏడుస్తూ అంది.

''నిజానికి మన మిప్పుడు సంతోషపడాలి. మన మధు బుద్ధిమంతుడు. తల్లిదండ్రుల మీద ప్రేమ, బాధ్యత ఉన్నవాడు కాబట్టే ముందుగానే మనతో ఒక మాట చెప్పాడు.

''చెప్తే మాత్రం ?''

''ఆవేశపడకు?''

''చెప్పేడూ అంటే మన మాటకీ, మన అభిప్రాయానికీ విలువ ఇచ్చాడనేగా?''

''ఏమో ! మీ మాటలు నా కర్థం కావడం లేదు''

''చెప్తాను విను. మొన్న పరశురాం గారి అబ్బాయి ఇలాగే ఒక అమ్మాయిని ఇష్టపడి, కనీసం మాట కూడా చెప్పకుండా పెళ్లి చేసేసుకున్నాడు. ఆ వార్త తెలిసి ఆ తల్లిదండ్రులు కొయ్యయిపోయారు. కొడుకు ఇష్టపడి పెళ్లి చేసుకున్నందుకు కాకుండా, తమ మీద చూపించిన నిర్లక్ష్య వైఖరికి ఆ ఇద్దరూ కృశించి పోయారు. నలుగురిలో తలెత్తుకోలేక అవమానపడిపోయారు. నూతన దంపతులను ఆహ్వానించాలన్నా తామేదో ఓడిపోయినట్లు బాధపడిపోయారు. ఆ అవమానంలో నుంచి కసి పుట్టుకొచ్చి బతికుండగా వాళ్ల ముకం చూడమనే కఠిన నిర్ణయం తీసుకున్నారు. చల్లగా, హాయిగా, ఆనందంగా ఉండే ఆ సంసారం ఒక్కసారి దుఃఖసాగరమైపోయింది.

''ఆ దృష్టితో చూస్తే మన మధు ఎంతో నిజాయితీగా ఉన్నాడు. ఇప్పుడు రోజులు, కాలం, ఆచార వ్యవహారాలు అన్నీ మారిపోయాయి. వాళ్లు ఇష్టపడిన తర్వాత మనం కాదని, వాళ్ళని బాధపెట్టి మనం బాధపడటం అనవసరం. మనం కాదన్నా వాళ్లు

ఆగరు, అందువల్ల మనమూ మన గౌరవం నిలుపుకున్నట్టుంటుంది. మన మధు తెలివైన వాడు, మంచివాడు, వాడి సెలక్షన్ తప్పకుండా బాగుంటుందని నాకు నమ్మకముంది''.

''పిల్ల ఎలా ఉంటుందోనండీ?'' గాభరాగా అంది.

''మనం అవును అన్నామని తెలిస్తే ఆ అమ్మాయి కూడా మనను గౌరవించి ఆదరిస్తుంది.''

''అయితే ఏం చేద్దాం.''

''అక్షింతలు వేసి ఆశీర్వదిద్దాం''.

★ ★ ★ ★

పెళ్ళి చక్కగా జరిగిపోయింది. ఈ ప్రేమా-పెళ్ళి వ్యవహారంలో గెలుపు లతదేనని పించింది మధుకి.

మొదటి రాత్రి

''లతా ! నీతో ఎలా మాట్లాడాలో తెలియడంలేదు'' అన్నాడు తన ఓటమిని అంగీకరిస్తున్నట్లుగా.

''అందుకే మధూ, నువ్వేం మాట్లాడకుండా నేను చెప్పేది విను. ప్రేమ అంటే చీకటి గదిలో వెలిగించిన కొవ్వొత్తిలా తెల్లని నిర్మలమైన కాంతిని నాలుగు వైపులకి పంచాలి. అంతేగానీ, మన ప్రేమ చుట్టుపక్కల వాళ్ళకి దుఃఖాన్ని, మనస్తాపాన్ని కలిగించకూడదు'' ! అంటున్న లత వైపు చూస్తూండిపోయాడు మధు.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక
5-11-1994